# మనసున్న మనిషి!

చంద్రమండలం మీద స్థలాలు కారుచౌకట!... నీవూ ఓ వంద ఎకరాలు కొని పడేయరాదూ?... ఎప్పటికైనా లాండ్ రేట్స్ పెరిగితే నువ్ కోటీశ్వరుడౌతావ్...' గంగరాజు సలహా ఇచ్చాడు అప్పల్రాజుకి!

ఆ మాట విన్న గంగరాజుకి వళ్ళుమండింది.

'ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికి కెక్కాలనుకుందిట! సంసారం వెళ్ళతీయటానికే నాకొచ్చే జీతం చాలకుండా వుంటే... నేను స్థలాలు కొంటవూ?... అందులోనూ చంద్రమండలంమీద!... నీకేమైనా మతిగాని పోయిందేమిటోయ్ అప్పల్రాజూ!?- అంత వెటకారం వద్దులే...' చిన్నపుచ్చుకున్నాడు గంగరాజు.

బోడి సలహాలు... ఉచిత సలహాలు ఇవ్వటంలో అప్పల్రాజు గొప్పోడు. మనిషి మాటకారి! ఎంతటి వాడినైనా క్షణాల్లో బుట్టలో వేసుకోగల దిట్ట! అప్పల్రాజు లాంటి పైరవీ కారుడు ఈ భూమ్మీద మరొకడు వుండడు.

గంగరాజు దృష్టిలో అప్పల్రాజు ఒక బ్రోకరు! బ్రోకరంటే బూతేం కాదు. ఇద్దరి వ్యక్తులకు సంధానకర్త! అదర్ వైజ్ కమీషన్ ఏజంట్ అంటే కొంచెం గౌరవప్రదంగా ఉంటుంది. వారికి వీరికి పన్లుచేసిపెట్టినందుకు 'కూలీ' ఐమీన్ బ్రోకరేజ్ పుచ్చుకోవటం అతని వృత్తి! అదే అప్పల్రాజుకి జీవనోపాధి!

ఇద్దరిదీ చిన్ననాటి పరిచయం!

గంగరాజుకి జాబొచ్చి హైదరాబాద్ చేరుకున్న కొత్తల్లో ఒకరోజు నడి బజార్లో అప్పల్రాజు తారసపడ్డాడు. అది లగాయితే అప్పల్రాజు 'ఫెవికాల్'కు మల్లే గంగరాజుకు అతుక్కున్నాడు.

సిటీకొచ్చిన కొత్తల్లో చాయ్ నీళ్ళకు కూడా జేబులో డబ్బుల్లేక... గంగరాజు మీదే వాలిపోయేవాడు. అది బొత్తిగా నచ్చలేదు గంగరాజుకి.

అప్పటికీ ఒకసారి అననే అన్నాడు 'అప్పల్రాజూ! నీది మరీ ఓ.సీ. బతుకైంది' అని.

అందుకేమాత్రం బిడియపడలేదు అప్పల్రాజు.

'రోజులన్నీ నీవే అనుకోకు!... ఒకనాటికి ఈ సిటీ ఏలేస్తాను. కోట్లకి పడగలెత్తుతాను...' కళ్ళు పెద్దవిచేసి మాట్లాడేడు అప్పల్రాజు. నిజంగ అంతటివాడు కాగలడనే ధీమా అతని మాటల్లో తొంగిచూచింది.

పెద్ద చిన్న అనే వ్యత్యాసం లేకుండా అప్పల్రాజుకి సిటీలో అందరితోను

పరిచయాలు పెంచుకున్నాడు. మనిషిలో ఠీవి... దర్జా... పెరిగింది.

పొట్ట పొడిస్తే అక్షరం ముక్కలేకపోయినా... అప్పల్రాజుని చూచిన వారెవరైనా వందెకరాల ఆసామి అనుకుంటారు ఇప్పుడు!

ఒకప్పుడు గోచీ పెట్టుకుని గ్రామంలో తిరుగుతూ... పక్కనే పారే కాలువలో పశువులను గడ్డితో శుభ్రం చేస్తూ... వాటిపై స్వారీ చేస్తూ కాలువలో ఈతకొడుతూ... తడి వొంటిని ఎండకు ఆరబెట్టుకునేవాడు... గోచీ తప్పించి ఓ చొక్కాగాని నిక్కరు గాని వేసుకున్న పాపానపోలేదు.

అప్పల్రాజు తండ్రి కాలువగట్టు ఒడ్డునే వున్న గుడిసె ముందు కూర్చుని బుట్టలు గంపలు అల్లుతు మేదరి వృత్తి చేసుకుంటూ పొట్ట పోసుకునేవాడు.

తల్లిలేని అప్పల్రాజుని తండ్రే కష్టపడి సాకాడు. బుట్టలు అల్లడం నేర్చుకోమని తండ్రి ఎంత చెప్పినా గ్రామంలో వారి పశువులను మేపటానికే ఇష్టపడేవాడు.

పదిమందీ ఇచ్చే పావలో అర్ధో తండ్రికి తెలీకుండా తనే దాచుకునేవాడు అప్పల్రాజు.

అలాంటి అప్పల్రాజు సిటీ వచ్చాక బతకటానికి అనేక మార్గాలు అన్వేషించి... చివరకు 'బ్రోకర్'గ స్థిరపడ్డాడు.

అందరికీ సలాములు చేసి మధ్యవర్తిత్వం చేస్తూ... ఎంతటివారినైనా తన గులామును చేసుకుంటూ... బ్రేకెసి మాటలతో పడేస్తూ... చెమ్చాగిరీ చేస్తూ హేపీగ బతికేస్తున్నాడు.

హయర్ సర్కిల్స్ వారందరూ అప్పల్రాజును 'చమ్చా అప్పల్రాజనో...' బెడ్డింగ్ అప్పల్రాజనో ఎవరికి తోచినరీతిలో వారు ముద్దుగ పిల్చుకుంటారు.

తాను చేస్తున్నపనికి ఏమాత్రం సిగ్గుపడని వ్యక్తి!

ఉద్యోగాలు ఇప్పించగలడు! ట్రాన్స్‌ఫర్ చేయించిపెట్టగలడు. పర్మిట్లు ఇప్పించగలడు. అది ఇది అనిలేదు. ఎలాంటిపనైనా అవలీలగ చేయించటంలో అతనికి అతనే సాటి!

మినిస్టర్లకు... ఎం.ఎల్.ఏ.లకు పెంపుడు కుక్కలాంటివాడు! వాళ్ళు విసిరేసే ఎంగిలి బిస్కట్ ముక్కలు తిని పైకొచ్చినవాడు.

'ఇలా బతకటం హేయంగా లేదా అప్పల్రాజు...?' చనువుకొద్దీ ఒకసారి ఇరానీ హోటళ్లో చాయ్ సిప్ చేస్తూ ప్రశ్నించాడు గంగరాజు.

'ఈ ప్రపంచంలో గల జనాభా అంతా ఒకేవిధంగ బతుకుతున్నారా గంగరాజూ?!- చదువుకుని వుద్యోగాలు చేసేవాళ్ళు... వ్యాపారం చేసుకు బ్రతికేవారు... ఆటోరిక్షాలు తోలేవారు... జేబులు కొట్టి జీవిస్తున్నవారు... ఇంకా... అనేకులు... వారివారి తెలివికొద్దీ తికేస్తున్నారు. చదువులేని నేను ఈ మార్గాన్ని ఎంచుకున్నాను! తప్పా?- చేసేపనిలో

ఉచ్చము... నీచమూ అంటూ ఏమీ వుండవ్. అంతా మనం అనుకోవటంలోనే వుంటుంది. మంచి అయిన చెడు అయినా అంతే! చాలామందికి పన్లు ఎలా చేసుకోవాలో... ఎవరిని పట్టుకోవాలో... ఆశ్రయించాలో... అవినీతిపరులకు లంచం ఎలా ఇవ్వాలో తెలీక... పన్లుకాక... బాధపడేవారంతా... నాపంటివారిని ఎంచుకుని పన్లు సులువుగా చేయించుకుంటారు...' బుల్లి వుపన్యాసం దంచాడు అప్పల్రాజు.

అప్పల్రాజు సిటీ వచ్చాక ఎంత ఎదిగేడు. మాటలు నేర్చాడు. తెలివితేటలు పెరిగాయి. డబ్బు సంపాదనలో పడ్డాడు.

అనతికాలంలోనే అప్పల్రాజు మేరువులా ఎదిగాడు. సిటీ నడిబొడ్డున విల్లా కట్టించాడు. లేటెస్ట్ మోడల్ కారు కొన్నాడు. చేతికి ఇంపోర్టెడ్ రిస్ట్ వాచీ... చేతికి గోల్డ్ బ్రాస్‌లెట్... మెడలో పలుపు తాడుపోలిన గోల్డ్ చెయిన్... చేతిలో నలిగిపోయే సెల్‌ఫోన్... అదృష్టం అతడిని అందలం ఎక్కించింది.

అప్పల్రాజులాంటి వాడు ప్రమాదకరమైన వ్యక్తిగా భావించిన గంగరాజు అతనికి దూరంగా వుంటూనే వస్తున్నాడు.

కొత్తల్లో పాతిక పరక అవసరానికి తనవద్ద అప్పు తీసుకునేవాడు. ఎప్పుడో వున్నప్పుడు తిరిగి ఇచ్చేవాడు.

అలాంటి అప్పల్రాజు ఇప్పుడు కోటీశ్వరుడు. అయినా తన దగ్గర పోజుకొట్టడు. రోజుకొకసారైనా ఇంటికొచ్చి కల్సుకుని గంగరాజు ఇచ్చే చిక్కటి చక్కటి టీ తృప్తిగా తాగి పోతుంటాడు.

'ఏదైనా సాయం కావలసివస్తే అడుగు గంగరాజూ!... నీక్కాకపోతే ఎవరికి చేస్తానూ? నువ్వేం బ్రోకరేజి ఇవ్వనక్కర్లేదులే!...' నవ్వుతూ అన్నాడు.

'అప్పల్రాజూ! నీకు వెనకాముందు ఎవరూలేరు. మీ అమ్మ చిన్నతనంలోనే చనిపోయింది. నువ్వు సిటీకొచ్చాక తండ్రీ కాలంచేశాడు. వంటరిగ ఇలా ఎన్నాళ్ళు? హాయిగ పెళ్ళి చేసుకో. కోట్ల ఆస్తికి వారసుడిని కనవయ్యా...'

'నేను బ్రతికినంతకాలం... ఇలాగే... వంటరిగా... దర్జాగా... అన్నీ అనుభవిస్తూ బతికేస్తాను!- డిగ్రీ చదువుకున్న నీ సంపాదనెంత? ఆఫ్టాల్ నెలకి పదివేలు! నీకు నలుగురు పిల్లలు... నువ్వు పడే కష్టాలు... వేదన చూస్తున్నాను కదా? సంసారమనే జంజాటం వద్దనుకున్నాను. భీష్ముడిలా బతుకుతాను. నాకు స్నేహితుడివైనా... బంధువైనా నువ్వే గంగరాజూ...' అప్పల్రాజు కంఠం జీరవోయింది.

'మరైతే నీవొక్కడికోసం ఇంత ఆర్జించి వెనకేయటం అవసరమా?-' చనువు తీసుకుని ప్రశ్నించాడు.

అందుకు బదులుగా నవ్వి 'నేను గంజినీళ్ళు తాగేను. వంటిన గుడ్డల్లేకుండా బతికాను. గొడ్లు కాసాను. చదువంటే ఏమిటో తెలీదు. అయినా నేను ఎలాగైనా గొప్పోడ్ని కావాలని కలలు కంటూ వుండేవాడిని. ఆకలి బాధ ఎలా వుంటుందో తెల్సిన నేను కసితో సంపాదించటం ప్రారంభించాను!... ఆశించిన లక్ష్యం చేరుకున్నాను. నాగురించి ఎవరేమనుకున్నా నాకు బాధలేదు- నువ్వు నాక్కావాలి! నువ్వు నావాడివి! డబ్బు అవసరమైతే అడగటానికి మొహమాటపడద్దు! ఎంత కావాలన్నా... వడ్డీ లేకుండా ఇస్తాను. అప్పుగా మాత్రం కాదు. నీ అవసరాలకోసం... నిన్ను ఆదుకోవాలనే ఆపేక్షతో ఇస్తాను...' ఉద్వేగం అప్పల్రాజు మాటల్లో కట్టలు తెంచుకుంది.

'నేనంటే ఎంత అభిమానం అప్పల్రాజు నీకు?- ఇద్దరిదీ ఒకే వూరు అయినంత మాత్రాన నన్ను ఇంతగా అభిమానించాలా... ప్రేమించాలా?- గౌరవించాలా?-' గంగరాజు వళ్ళు పులకరించింది.

★ ★ ★ ★ ★

అప్పల్రాజుకి పార్టీ టిక్కెట్టు ఇస్తామన్నారు. రాజకీయాల్లో కొస్తే కేబినెట్ మినిస్టర్‌ని చేస్తామన్నారు. ఎవరినీ నమ్మని అతను రాజకీయాలకు దూరంగ వుండటమే మంచిదనుకున్నాడు. ఎవరికీ లొంగలేదు. ఎవరి మాటా విన్లేదు. తనేమిటో తనకు తెల్సు!

దుబాయ్‌కి అమ్మాయిలను చేరవేస్తున్నాడని... నకిలీ పాస్‌పోర్ట్ ముఠాతో సంబంధాలున్నాయని... దొంగనోట్లు చలామణీ చేయిస్తున్నాడనీ... పోలీసు వర్గాలకు తెలీటంతో అప్పల్రాజుపై నిఘా వేశారు. కాపు కాచారు. ఏదోవిధంగ అతడిని కేసుల్లో ఇరికించాలని విశ్వప్రయత్నం చేసిన పోలీసు వారి ప్రయత్నం బెడిసికొట్టింది.

అప్పల్రాజు జోలికి వెళ్ళటానికి వీల్లేదంటూ హోం మినిస్టర్ పోలీసు అధికారులకు వార్నింగ్ ఇవ్వటంతో పోలీసు వారి ప్రయత్నాలపై నీళ్ళు చల్లినట్టన్పించింది.

రాత్రి సమయంలో టి.వీ.లో వార్తలు వింటున్న గంగరాజు 'జంట నగరాల్లో పలుకుబడి కలిగిన ప్రజాబంధు అప్పల్రాజు హఠాన్మరణం. రోడ్ యాక్సిడెంట్‌లో అశువులు బాసినందుకు అభిమానులంతా దుఃఖసాగరంలో మునిగిపోయారంటూ' వచ్చిన న్యూస్ విని మ్రాన్పడ్డాడు. గంగరాజు గుండె ఆగినట్టయింది. అప్రయత్నంగ కళ్ళు అశ్రుపూరితాలైనయ్.

ఇది యాక్సిడెంట్ అయి వుండదు. అతనంటే గిట్టనివారి పన్నాగమై వుండాలన్పించింది!

గబగబా బట్టలు వేసుకున్న గంగరాజు పోలీస్ స్టేషన్‌కి హుటాహుటిన చేరుకుని

వివరాలు తెల్సుకున్నాడు.

ఒక అజ్ఞాతవ్యక్తి టూ వీలర్‌పై స్పీడుగా వచ్చి అప్పల్రాజు కారును గుద్దిన కారణంగ తన మిత్రుడు స్పాట్ డెత్‌పాలైనాడనీ... యాక్సిడెంట్ చేసిన వ్యక్తి ఎవరికీ దొరక్కుండా పారిపోయాడనీ...ఇది ఫలానా రౌడీషీటర్ ప్లాన్ అయి వుండాలనీ... అతని పనులకు అప్పల్రాజు అడ్డుగా వుంటున్న కారణంగానే అప్పల్రాజుపై గల కక్షతో... ఆ రౌడీషీటరే ఇంతటి ఘోరానికి పాల్పడి వుంటాడనే విషయాన్ని పోలీసువారు చెప్పగా విన్న గంగరాజు హృదయం విలవిల్లాడింది.

అప్పల్రాజు ఏకాకి అయినా అనాథకాదు. అతనికి తానున్నాడు. పోస్టుమార్టం తర్వాత అప్పల్రాజు శవాన్ని గంగరాజు స్వాధీనం చేసుకుని ఘనంగ అతని భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించాడు.

ఒక స్నేహితుడుగా... ఆత్మీయుడుగ... అప్పల్రాజు ఆత్మశాంతి కోసం తాను చేయగలిగినదంతా చేశాడు గంగరాజు.

అతని ఆస్తికి వారసులెవరూ లేరని తెల్సిన గంగరాజు... అప్పల్రాజు విల్లాలో అణువణువు గాలించి సేఫ్‌లో గల దస్తావేజులు చూశాడు.

దస్తావేజులు సంపూర్ణంగా చదివిన గంగరాజు నివ్వెరపోయాడు. అతని తదనంతరం యావదాస్తి తనకు చెందాలని దస్తావేజుల్లో రాసి వుండటం చూచి దిగ్భ్రాంతికి లోనయ్యాడు.

నో!... అలా జరగటానికి వీల్లేదు. అతని సంపద తనకు అక్కర్లేదు!

అప్పల్రాజు తనను ఎంతగా అభిమానించాడో ప్రేమించాడో బోధపడింది. బ్రతికి వుండగ ఈ విషయాన్ని తనకెందుకు చెప్పలేదో గంగరాజు ఊహకు అందలేదు. అతను ఎంచుకున్న మార్గం హర్షణీయం కాకున్నా... మంచి మనసున్న మనిషి అప్పల్రాజు.

ఆస్తిలో వక్క పైసా అయినా తనకు చెందనవసరంలేదని నిర్ణయం తీసుకున్న గంగరాజు... అప్పల్రాజు యావదాస్తిని అనాథ శరణాలయాల పరంచేసి తృప్తిపడ్డాడు.

(సారితీ కిరణం మాస పత్రిక)